
శ్రీఆంజనేయస్వామి మూలవిరాట్టు


ఇరుముడులతో తరలివస్తున్న స్వాములు


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


శ్రీఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తుడు

కాషాయమయం

- నేత్రపర్వంగా హనుమాన్ జయంతి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు, స్వాములు
- జనసంద్రమైన కొండగట్టు అంజన్న సన్నిధి
- సుమారు రెండు లక్షల మంది రాక
- ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు
- ఇంటిదారి పట్టిన భక్తులు

మల్యాల(చొప్పదండి): ఎటు చూసినా భక్తజనం.. ఏ మూలన విన్నా జై బోలో హనుమాన్ నామస్మరణం.. ఏ చోటుకు వెళ్లినా కాషాయరంగు దుస్తులు ధరించిన స్వాములు.. ఏ నోట విన్నా దీక్ష చేపట్టిన స్వాముల భజనలు.. వెరసి కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధి భక్తజన సంద్రంగా మారింది. హనుమాన్ పెద్దజయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, దీక్షస్వాములు, మాలధారులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలైన్ల ద్వారా ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ముడుపులు చెల్లించుకున్నారు. మాల, దీక్ష విరమించారు. తలనీలాలు సమర్పించుకున్నారు. ఈనెల 12న ప్రారంభమైన ఉత్సవాలు.. ఆదివారం పెద్దజయంతి వేడుకలతో ముగిశాయి. రెండ్రోజులపాటు సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు సుమారు లక్ష మంది దీక్ష, మాలధారులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్ ఉత్సవాలను పర్యవేక్షించారు. ఆదివారం శ్రీఆంజనేయస్వామి మూలవిరాట్టును లక్ష నాగవల్లి దళాలతో అలంకరించారు. అనంతరం అర్చన నిర్వహించారు. 11 రకాల భోగాలతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్రస్వామి, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవి, స్థానాచార్యులు కపేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి మొక్కుతున్న భక్తులు


ఆకట్టుకున్న భక్తుడు


తలనీలాలు సమర్పిస్తూ..


కుమారుడితో తరలివస్తున్న భక్తుడు


మొక్కులు చెల్లిస్తున్న యువతి


భక్తులు చెల్లించుకున్న ముడుపులు


ముడుపులు కట్టి మొక్కు చెల్లించుకుంటున్న భక్తుడు..


మొక్కుతున్న యువతి

న్యూస్‌రీల్

ధర్మపురికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి : హనుమాన్ జయంతి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామితోపాటు అనుబంధ ఆలయాల్లో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామివారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మాలలు ధరించి, దీక్ష చేపట్టిన భక్తులు కొండగట్టు అంజన్న సన్నిధిలో విరమణ చేశాక నేరుగా ధర్మపురి క్షేత్రానికి చేరుకున్నారు. దీంతో ఆలయ సన్నిధి కాషాయమయమైంది. వైవదర్శనం కోసం రెండు గంటల సమయం పట్టింది. వాహనాల పార్కింగ్‌కు సమస్యలు ఎదురయ్యాయి.

ఘనంగా మాతృ దినోత్సవం


మాతృమూర్తిని సన్మానిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కూతుళ్లు, కుమారులు కలిసి తమ మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి హరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి లక్ష్యం


యజ్ఞ క్రతువు నిర్వహిస్తున్న భక్తులు

వెల్గటూర్(ధర్మపురి): ప్రపంచశాంతి కోసం గీతా హవన యజ్ఞం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేశ్ తెలిపారు. స్థానిక శ్రీరామ భక్తాంజనేయ దేవస్థానం 27వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం గీతా హవన యజ్ఞం నిర్వహించామని ఆయన పేర్కొ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు మురళిగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం


ముత్తయ్యరెడ్డిని అభినందిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో ఆదివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఊహరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏలేటి ముత్తయ్యరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎడ్లపురం అంజయ్య, రామదాసు, రమేశ్, కోశాధికారిగా బైకని కొమురయ్య, జాయింట్ సెక్రటరీగా జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా మరిపెల్లి కార్తీక్, ప్రశాంత్, అశోక్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు కడారి రవి పాల్గొన్నారు.

4.16 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు


మాట్లాడుతున్న డీఆర్డీవో లక్ష్మీనారాయణ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మహిళలు నిర్వహిస్తున్న 114 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 4,16,650 క్వింటాళ్ల వడ్లు సేకరించినట్లు డీఆర్డీవో లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలో మహిళా సమాఖ్యలకు ఆదివారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపుల విషయంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ట్యాబ్‌లో కొత్తగా 15.4 వర్షన్ వచ్చిందని, అందుకే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ సిబ్బంది ఉన్నారు.

పోరాటాల గడ్డ.. హిందుత్వ అడ్డా..!

- కరీంనగర్ ప్రజలకు సేవచేయడం పూర్వజన్మ సుకృతం
- ఏక్తాయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- కమలదళంతో కాషాయమయంగా కరీంనగర్ నగరం


గద ప్రదర్శిస్తున్న బీజేపీ నేత బండి సంజయ్


కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తా యాత్రకు హాజరైన అశేష జనవాహిని

కరీంనగర్‌టౌన్: 'పోరాటాల కరీంనగర్ గడ్డ బండి సంజయ్‌ది.. హిందుగాళ్లు బొందుగాళ్లన్న వాళ్లను బొందపెట్టిన గడ్డ ఇది.. హిందుత్వ అడ్డా ఇది.. కరీంనగర్ వేదికగా హిందూ సమాజానికి సేవ చేసే అదృష్టం రావడం పూర్వజన్మ సుకృతం.. కరీంనగర్ గడ్డకు రుణపడి ఉంటా..' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం కరీంనగర్ నగరంలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మతో కలిసి హిందూ ఏక్తాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మీరంతా ఆశీర్వదించండి... తెలంగాణ మొత్తం హిందుత్వ వాతావరణం తీసుకొచ్చేందుకు పోరాడుతానని అన్నారు. బాలగంగాధర్ తిలక్ హిందువులను సంఘటితం చేసేందుకు వినాయక ఉత్సవాలను ఎలా నిర్వహించారో.. అదే స్ఫూర్తితో తెలంగాణలో హిందువులందరినీ సంఘటితం చేసి రామరాజ్యం స్థాపించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని స్పష్టం చేశారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్ద జరిగిన పాదయాత్ర ఎంతటి సంచలనం సృష్టించిందో.. కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తాయాత్ర అంతటి సంచలనం సృష్టించిందనడానికి ఇక్కడికి వచ్చిన విశేష జనమే నిదర్శనమన్నారు.

కాషాయమయమైన కరీంనగర్...

హిందూ ఏక్తాయాత్రతో కరీంనగర్ నగరం కాషాయమయమైంది. పెద్ద ఎత్తున కాషాయదండు కదిలిరావడంతో నగర వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. మహిళల డప్పు వాయిద్యాలు, భారీ హనుమంతుడి విగ్రహాలు, విభిన్న వేషధారణలు, విభిన్న సంస్కృతి, సాంప్రదాయ వస్త్రధారణలతో హిందూ ఏక్తాయాత్రలో పాల్గొన్నారు. మహిళల మంగళహారతులు.. జైశ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణలతో కరీంనగర్ మారుమోగింది. శ్రీరామ చంద్రుడి విగ్రహాలు, ప్రత్యేకంగా తయారు చేయించిన హనుమంతుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. భారీ వాహనంపై పడుకున్నట్లు కనిపిస్తూ ఒక చేతిలో రాముడు, మరో చేతిలో సీతమ్మవారి విగ్రహాలతో తయారు చేసిన హనుమంతుని విగ్రహం హైలైట్‌గా నిలిచింది. భక్తి పాటలు.. ధార్మిక ప్రసంగాలు.. హైందవ గొప్పతనాన్ని చాటేలా ఊరేగింపులతో ఏక్తాయాత్ర నయానందంగా సాగింది.

ఏక్తాయాత్ర సాగింది ఇలా..

హిందూ ఏక్తాయాత్ర వైశ్య భవన్ వద్ద ప్రారంభమై.. రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్, శాస్త్రీరోడ్, భారత్ థియేటర్, కమాన్ చౌరస్తా, బస్టాండ్, తెలంగాణ చౌక్, ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ రోడ్ మీదుగా తిరిగి వైశ్యాభవన్‌కు చేరుకుంది. మూడు రోజుల ముందు నుంచే నగరం మొత్తం కాషాయజండాలతో అలంకరించారు. కాషాయజెండాలతో నగర వీధులన్నీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. యాత్రకు భారీ ఎత్తున జనం తరలిరావడంతో హిందుత్వ సైనికులతో కరీంనగర్ కాషాయమయమైంది.


కళాకారుల ఆటాపాట


ఆకట్టుకున్న విన్యాసాలు


హిందూ ఏక్తాయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

దంచికొడుతున్న ఎండలు

- జైనాలో గరిష్టంగా 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు
- గంటకు 21 కి.మీ వేగంతో వడగాడ్పులు వీచే అవకాశం

జగిత్యాలఅగ్రికల్చర్: అకాల వర్షాలతో మొన్నటి దాకా చల్లగా ఉన్న వాతావరణం రెండురోజులుగా వేడెక్కుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సూర్యుడు ఉగ్ర రూపం ప్రదర్శిస్తున్నాడు. మరో నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని పొలాస వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జైనాలో గరిష్ట ఉష్ణోగ్రతలు..

- జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ధర్మపురి మండలం జైనా గ్రామంలో ఆదివారం 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకు మించి నమోదైన ప్రాంతాలను రెడ్‌జోన్లుగా అధికారులు ప్రకటించార.

కొనసాగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు..

- మరోవారం పాటు జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొన్నటివరకు గరిష్టంగా 41–43డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, ప్రస్తుతం 43–45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. గతంలో కనిష్టంగా 21–23 డిగ్రీల సెల్సియస్ ఉండగా, ప్రస్తుతం 26–27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మధ్యాహ్నం ఉక్కపోత..

- ఉదయం 50–56 శాతం, మధ్యాహ్నం 23–31శాతం గాలిలో తేమ నమోదవుతోంది. మధ్యాహ్నం తేమశాతం తగ్గడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కపోత అధికంగా ఉంటోంది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఈసందర్భంగా కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

వాతావరణంలో మార్పులే కారణం..

- వాతావరణంలో తరచూ వస్తున్న మార్పులే ఉష్ణోగ్రతలు పెరగడానికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కార్బన్ డై ఆక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్, గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరగడంతో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరిస్తున్నారు.


నిర్మానుష్యంగా మారిన జగిత్యాలలోని ఓ కాలనీ

ఉష్ణోగ్రతల వివరాలు(డిగ్రీల సెల్సియస్)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
ధర్మపురి	బుద్దేశ్‌పల్లి	44.8
ఎండపల్లి	ఎండపల్లి	44.5
సారంగాపూర్	సారంగాపూర్	44.5
బీర్‌పూర్	కోల్వాయి	44.3
వెల్గటూర్	గుల్లకోట	44.2
ఇబ్రహీంపట్నం	గోధూర్	44.2
ధర్మపురి	నేరెళ్ల	44.0
బుగ్గారం	సిరికొండ	43.9
వెల్గటూర్	వెల్గటూర్	43.8
పొలాస	పరిశోధన స్థానం	43.6
కోరుట్ల	కోరుట్ల	43.4
మల్లాపూర్	మల్లాపూర్	43.3
గొల్లపల్లి	గొల్లపల్లి	43.2
కోరుట్ల	ఐలాపూర్	43.1
మెట్‌పల్లి	మెట్‌పల్లి	43.1
పెగడపల్లి	పెగడపల్లి	43.0

మరోనాలుగు రోజులు ఇదే పరిస్థితి

వాతావరణం చోటుచేసుకుంటున్న మార్పులతో జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు 44–45 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో వడగాల్పుల ప్రభావం కూడా అధికంగా ఉండే అవకాశం ఉంది.

– శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



నర్సయ్య మృతదేహం

రాయికల్: మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామ శివారులో ట్రాక్టర్ ఢీకొని మల్లాపూర్ మండలం వేంపెల్లి గ్రామానికి చెందిన కలాలి నర్సయ్య (55) మృతిచెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య కడెం మండలం.. లక్ష్మీసాగర్‌లోని తన బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లాడు. తిరుగుప్రయాణంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రాయికల్ మండలం ఒడ్డెర కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పాల్త్య రాజేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి మత్స్య కార్మికుడు...

రాయికల్ : మండలంలోని సింగరావుపేట గ్రామానికి చెందిన మత్స్య కార్మికుడు రొడ్డ నడ్పి భూమయ్య (60) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. నడ్పి భూమయ్య ఆదివారం గ్రామంలోని చింతల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల పట్టేందుకు చెరువులో వల వేయగా వలలో చిక్కుకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం?

- రెండు, మూడు రోజుల్లో వెలువడనున్న జాబితా

జగిత్యాల క్రైం : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న వీఆర్‌లో ఉన్న ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే పలువురు ఎస్సైలు బదిలీల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సిఫారసు లేఖలు కూడా ఉన్నతాధికారులకు అప్పగించారు. జిల్లాలో హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా బందోబస్తు ఉండటంతో బదిలీలను నిలిపివేయగా ఆదివారం ఉత్సవాలు పూర్తికావడంతో జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ రెండు, మూడురోజుల్లో ఉత్తర్వులు జారీకానున్నాయి. కొందరు ఎస్సైలు ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తికావడంతో వారితో పాటు మరికొందర్ని బదిలీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం వీఆర్‌లో పనిచేస్తున్న వారిని ఎస్సైలుగా నియమించే అవకాశం ఉంది.



ఆలయం ఆవరణలో స్వాములు



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

'కొండ'ంత భక్తి

కొండగట్టు అంజన్న క్షేత్రం కాషాయమయమైంది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా శనివారం నుంచే వేలాది మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులు కొండకు చేరుకున్నారు. దీక్షాపరులు మాల విరమణ చేశారు. రామలక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్ కీ అంటూ హనుమాన్ భక్తుల నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. తలనీలాలు సమర్పించి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోనేరులో స్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తదితర ఏర్పాట్లు చేశారు.







కొండపైకి తరలివస్తున్న హనుమాన్ మాలధారులు



చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు



శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



హనుమాన్ జయంతి ఉత్సవాల్లో కొండగట్టు ఆలయ పరిసరాలు

మిల్లర్లను కట్టడి చేయండి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్లను కట్టడి చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరారు. నక్కలపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యంలో తేమశాతం అధికంగా ఉందనే సాకుతో రెండు నుంచి మూడు కిలోల కోత విధిస్తున్నారని పలువురు రైతులు అడ్లూరికి ఫిర్యాదు చేశారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ.. ఈసారి ధాన్యం దిగుబడి తగ్గిందని, అకాల వర్షాలతో చేతికందే దశలోని పంటలు నీటిపాలయ్యాయన్నారు. రైతులు ఇలా నష్టపోతే ఏవేవో కారణాలు చెబుతూ ధాన్యంలో రైస్‌మిల్లర్లు కోత విధించడం శోచనీయమన్నారు. వారిని కట్టడి చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో కోతలు లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైస్‌మిల్లర్లు తేమ పేరుతో కోత విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. ఇటీవల ఓ రైతు కొనుగోలు కేంద్రం వద్ద గుండెపోటుకు గురై మృతి చెందాడని గుర్తుచేశారు. ధాన్యంలో కోత విషయంలో మిల్లర్ల ఆగడాలు ఆపకుంటే సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేనెవరి కోసం బతకాలి కొడుకా..

- తండ్రి హార్వెస్టర్ నడుపుతుండగా ముందుభాగం తగిలి కొడుకు మృతి..
- మాతృ దినోత్సవం రోజున తల్లిదండ్రులకు కడుపుకోత
- అబ్బాపూర్‌లో విషాదం



రంజిత్ (ఫైల్)

గొల్లపల్లి : కంటికి రెప్పలా కాపాడుకుంటూ కళ్లెదుట పెరిగిన కొడుకు మృతిచెందడంతో తండ్రి రోదనలు మిన్నంటాయి. నేనెందుకు బతకాలి దేవుడా.. ఏ పాపం చేశాను అంటూ రోదించిన తీరు అందర్ని కలచివేసింది. మాతృదినోత్సవం రోజు జరిగిన ఘటనతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చెవుల ప్రభాకర్, విజయ దంపతులకు కుమారుడు రంజిత్ (17), కూతురు మేఘన ఉన్నారు. ప్రభాకర్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రంజిత్ ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఏ గ్రేడ్ సాధించాడు. కొన్నిరోజుల నుంచి తండ్రికి సాయంగా ఉంటున్నాడు. ఆదివారం వారి పొలంలో ప్రభాకర్ హార్వెస్టర్‌తో వరి కోసేందుకు వెళ్లగా తోడుగా వెళ్లాడు. రంజిత్ హార్వెస్టర్ ముందు ఉండటంతో గమనించలేదు. ముందుభాగం రంజిత్‌కు తగలడంతో అందులో చిక్కుకుపోయాడు. తర్వాత గమనించగా చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని జగిత్యాల మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సర్పంచ్ ముస్కు నిషాంత్ రెడ్డి, సర్పంచ్ పురంశెట్టి వెంకట పద్మ, రేవెల్లి సత్యనారాయణ, తదితరులు పరామర్శించారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందొద్దు



సెల్‌ఫోన్లు అందిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం : సెల్‌ఫోన్ పోతే ఎవరూ ఆందోళన చెందవద్దని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లా పరిధిలో వారం కింద పోగొట్టుకున్న, చోరీకి గురైన 29 సెల్‌ఫోన్లను గుర్తించి ఆదివారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా గుర్తించవచ్చన్నారు. సుమారు 2.5 లక్షల విలువగల 29 సెల్‌ఫోన్లను రికవరీ చేసి వారికి అప్పగించినట్లు తెలిపారు. డీఎస్పీ ప్రకాశ్, ఐటీకోర్ సీఐ సరిలాల్, ఆర్‌ఎస్‌ఐ దినేశ్, ఎస్సైలు ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



శంకుస్థాపన చేస్తున్న సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లిలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన చర్లపల్లె - కండ్లపల్లి-పోరండ్ల బీటీ రోడ్డు మరమ్మతు, రూ. 57 లక్షల వ్యయంతో చేపట్టిన చర్లపల్లి - కండ్లపల్లి రోడ్డు మరమ్మతు, కల్వర్టు నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిండు వేసవిలో కూడా నియోజకవర్గంలోని అన్నిచెరువులకు జలకళ సంతరించుకుందని అన్నారు. నాయకులు దావ సురేశ్, నక్కల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, సర్పంచులు తిరుపతి, దామోదర్, రజిత పాల్గొన్నారు. కాగా, ప్రజాసమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు. హన్మాజిపేటలో ఆయన పర్యటించారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



శిరీష (ఫైల్)

బుగ్గారం : బావిలో దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన గజ్జెల శ్రీనివాస్, శిరీష దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. ఆదివారం గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై ఇంటికి వచ్చాక ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొంతసేపటికి శ్రీనివాస్ బయటకు వెళ్లగా శిరీష ఇంటి సమీపంలోని బావిలో దూకింది. గమనించిన స్థానికులు బావిలోకి దిగి బయటకు తీయగా అప్పటికే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నృసింహుడి సన్నిధిలో వరంగల్ డీసీపీ

ధర్మపురి : ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఆదివారం వరంగల్ జిల్లా డీసీపీ మురళీధర్- సుమతి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం రేనవేషన్ కమిటీ సభ్యులు రామన్న, ఈవో శ్రీనివాస్ దంపతులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటోను అందజేశారు. అర్చకులు నంబి నర్సింహమూర్తి, రమణయ్య, ఎస్సై కిరణ్‌కుమార్, తదితరులున్నారు.

'సెస్' మాజీ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి మృతి

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్‌గా సేవలు
- సంతాపం తెలిపిన మంత్రి కేటీఆర్, వినోద్‌కుమార్



దోర్నాల లక్ష్మారెడ్డి (ఫైల్)

సిరిసిల్ల: 'సెస్' మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది దోర్నాల లక్ష్మారెడ్డి(69) సిరిసిల్లలో ఆదివారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో కన్నుమూశారు. తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన లక్ష్మారెడ్డి కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, సిరిసిల్ల ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అడ్వకేట్‌గా మంచి గుర్తింపు పొందడంతో పాటు 1995లో సిరిసిల్ల రూరల్ జెడ్పీటీసీ సభ్యుడిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్‌గా, క్రిమినల్ లాయర్‌గా, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రెండుసార్లు 'సెస్' చైర్మన్‌గా పనిచేశారు. లక్ష్మారెడ్డికి భార్య సరళ, కొడుకు డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి(డెంటిస్ట్), కూతురు సునంధ(కోర్టు ఉద్యోగి) ఉన్నారు. సిరిసిల్లలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా సిరిసిల్ల 'బార్' అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయవాదులు, వేములవాడ న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ సంతాపం..

లక్ష్మారెడ్డి మృతికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం తెలిపారు. ఆయన ×సెస్₹ చైర్మన్‌గా చేసిన సేవలను గుర్తుచేశారు. లక్ష్మారెడ్డి పార్థివదేహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ గజభీంకార్ రాజన్న, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అభినయ్ కుమార్

కోరుట్ల టౌన్ : పట్టణ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అభినయ్ కుమార్ బాధ్యతలు చేపట్టినట్లు మున్సిపల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాస ఆదివారం పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ సెలవులో ఉన్నందున మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అభినయ్ కుమార్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు.